ప్రచారాలు, ర్యాలీలకు అనుమతులు తప్పనిసరి

జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

రాజకీయ పార్టీలు ప్రచారాలు, ర్యాలీలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు, ప్రయివేట్ ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యం సార్వత్రిక ఎన్నికల ప్రచార సామగ్రి ప్రింటింగ్, ప్రచారాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించేందుకు అనుమతులు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని వాహనాలు, లౌడు స్పీకర్లు, ర్యాలీలు, సమావేశాలుకు 24 గంటల ముందు పొందాలని తెలిపారు. అనుమతి లేకుండా రాజకీయ పార్టీలు ప్రచారాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తే ఎన్నికల నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్ని కాపీలు, ఎన్ని పోస్టర్లు, ఫ్లెక్సీలు వాటి సైజు వంటి పూర్తి వివరాలు, ప్రింటింగ్ ప్రెస్ పేరు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు.

అన్నదాత.. ఆక్రందనలు..

- ధాన్యం సొమ్ము చెల్లించకుండా ముప్పతిప్పలు
- మూడు నెలలు గడుస్తున్నా అందని సొమ్ము
- జిల్లాలో రూ.15 కోట్లు ధాన్యం బకాయిలు
- బకాయిలు రాక పెట్టుబడుల కోసం రైతన్న నానావస్థలు



ప్రజాశక్తి - భీమవరం

గత సార్వాలో అన్ని ఇబ్బందులూ అధిగమించి చెమటోడ్చి పండించిన పంటకు ఇప్పటివరకూ డబ్బు చెల్లించకపోవడంతో అన్నదాత తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మూడు నెలలు గడుస్తున్నా ధాన్యం సొమ్ము ఇచ్చేందుకు ముప్పుతిప్పలు పెట్టడంతో లబోదిబోమంటున్నారు. జిల్లావ్యాప్తంగా రూ.15 కోట్ల ధాన్యం బకాయిలు పేరుకుపోయాయి. సుమారు 1,300 మంది రైతులు ధాన్యం డబ్బు కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకూ దాళ్వాలో ఎకరాకు రూ.25 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. గత సార్వా పంట డబ్బు చెల్లించకపోవడంతో ప్రస్తుత పంట కీలక దశలో ఉన్నా అదనపు పెట్టుబడులు పెట్టలేక రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం బకాయిలు తక్షణం విడుదల చేయాలని కౌలురైతు సంఘం డిమాండ్ చేస్తోంది.

ఎన్ని ప్రభుత్వాలు మారినా రైతుల పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. సాగుకు సహాయ సహకారాలు అందిస్తూ రైతులకు వెన్నుదన్నుగా ఉంటున్నామని వైసిపి ప్రభుత్వం చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన లేకుండా ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో సుమారు 2.20 లక్షల ఎకరాల్లో సార్వా సాగు జరిగింది. సుమారు 4.24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. సుమారు 67,500 మంది రైతులకు రూ.912 కోట్లు చెల్లించారు. మిగిలిన 1300 మంది రైతులకు సుమారు రూ.15 కోట్లు చెల్లించాల్సి ఉంది.

గత జనవరి 28వ తేదీ వరకూ ధాన్యం అమ్మకాలకు సంబంధించి డబ్బు చెల్లించారు. సుమారు మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ధాన్యం సొమ్ము జమ చేయకుండా ప్రభుత్వం అన్నదాతను ముప్పుతిప్పలు పెడుతోంది. అదిగో.. ఇదిగో అనడం తప్ప తప్ప బకాయిలు చెల్లించిన పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో అన్నదాతలు ధాన్యం సొమ్ము కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ధాన్యం సొమ్ము అందకపోవడంతో రైతులకు ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

సొమ్ములు ఇవ్వకున్నా.. దాళ్వా సాగు చేపట్టి

పంట కాలువలకు సాగునీరు విడుదల చేశామని, ముందస్తు సాగు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు రైతులపై ఒత్తిడి తేవడం.. మరోపక్క అమ్ముకున్న ధాన్యానికి రేపో, మాపో డబ్బులొస్తాయని భావించిన రైతాంగం దాళ్వా సాగు చేపట్టారు. అయితే ఇప్పటి వరకూ సార్వా ధాన్యం సొమ్ము జమ చేయకుండా దాళ్వా సాగు సాగేదెలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకూ సార్వా సాగులో దమ్ము చేసిన ట్రాక్టర్లకు సొమ్ము చెల్లించలేదని, ఎరువులు కొనుగోలు చేసిన దుకాణాల్లో బకాయిల సొమ్ము ఇవ్వలేదని, విత్తనాలు కొనుగోలు చేసేందుకు చేతిలో డబ్బు కూడా లేదని, కోత యంత్రాలకు సొమ్ము ఇవ్వని పరిస్థితి ఉందని రైతులు అప్పట్లో వాపోయారు. అయితే వీరందరికీ అటు ప్రభుత్వం, ఇటు అధికారులు ధాన్యం డబ్బులు చెల్లించే బాధ్యత తమదేనని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. దీంతో జిల్లావ్యాప్తంగా 2.10 లక్షల ఎకరాల్లో దాళ్వా సాగు చేపట్టారు. సాగులో సమస్యలు, ఆర్థిక సమస్యలు ఎదురైనప్పటికీ ముందుకు సాగారు. ప్రస్తుతం వరిచేలు పొట్ట దశ నుంచి వెన్ను పోసుకునే కీలక దశలో ఉన్నాయి. ఇప్పటి వరకూ ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేలు వరకు పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం సాగునీటి సమస్యలు వెంటాడుతున్నాయి. మరోపక్క పొలాలు కీలక దశలో ఉండడంతో వాటిని కాపాడుకునేందుకు వివిధ రకాల మందులను వినియోగించాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ నేపథ్యంలో అదనపు పెట్టుబడి పెట్టలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే గత సార్వా ధాన్యం సొమ్ము ఇప్పటి వరకూ చెల్లించుకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక, మరోపక్క పెట్టుబడులకు చేతిలో చిల్లిగవ్వలేక రైతులు సతమతమవుతున్నారు.

కౌలురైతుల పరిస్థితి మరింత దయనీయం

జిల్లాలో 80 శాతం సాగు కౌలురైతులే చేస్తున్నారు. వీరికి కౌలుకార్డులు పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో బ్యాంకులు రుణాలు పరిమితంగానే ఇస్తున్నాయి. దీంతో ప్రయివేటు వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు తెచ్చి వ్యవసాయ సాగు చేస్తున్నారు. ధాన్యం సొమ్ము అందకపోవడంతో తెచ్చిన అప్పులు తీర్చని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు కొత్త అప్పులు పుట్టే పరిస్థితి లేకుండాపోయింది. గత సార్వా ధాన్యం సొమ్ము ఎక్కువ శాతం కౌలు రైతులకు రావాల్సి ఉంది. దీంతో గత పంటకు అయినా ఖర్చు అంతా ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి అప్పు తేవడంతో వాటిని చెల్లించడానికి కౌలురైతులు నానావస్థలు పడుతున్నారు.

324 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

ప్రస్తుత దాళ్వాలో 7.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం లక్ష్యంగా తీసుకున్నారు. దీనికి జిల్లావ్యాప్తంగా 324 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. వచ్చేనెల మొదటి వారంలో ధాన్యం కొనుగోలు చేపట్టే విధంగా అధికారులు సమాయత్తమవుతున్నారు. సుమారు కోటీ 80 లక్షలు గోనె సంచులు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే 211 రైసు మిల్లులను ఇప్పటికే గుర్తించారు. ధాన్యం తరలించేందుకు హామాలీలతోపాటు 2,600 వాహనాలను ఏర్పాటు చేయనున్నారు. వీటికి సంబంధించి కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. అయితే గత సార్వా సొమ్ము చెల్లించకుండా ప్రస్తుతం ధాన్యం అమ్మకాలు చేయమనడం ఎంతవరకు సమంజసమని రైతులు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా ధాన్యం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

మూడు నెలలవుతున్నా సొమ్ము అందలేదు..

కేతా ఆదినారాయణ, కౌలురైతు, ఆచంట

ఎన్నో ఏళ్ల నుంచి కౌలుకు వ్యవసాయం చేస్తున్నాను. గత సార్వాలో ఎకరం ఎనిమిది సెంట్లు సాగు చేశాను. 40 కేజీల బస్తాలు 55 జనవరి 20న విక్రయించాను. సుమారు రూ.48 వేలు సొమ్ము రావాల్సి ఉంది. మూడు నెలలు కావొస్తున్నా చిల్లిగవ్వ ఇవ్వలేదు. దాళ్వా సాగుకు అప్పు చేసి పెట్టుబడులు పెట్టాను. తెచ్చిన అప్పు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాను.

ఎవరికి చెప్పినా పట్టించుకోవట్లేదు..

కుడిపూడి నరసింహారావు, కౌలు రైతు, ఆచంట

రైతు భరోసా కేంద్రానికి 16.8 క్వింటాళ్ల ధాన్యాన్ని జనవరిలో తరలించాను. 42 బస్తాలకు రూ.36,674 రావాల్సి ఉంది. ఇప్పటివరకు అందించ లేదు. అడుగుతుంటే అదిగో.. ఇదిగో అంటున్నారే తప్ప పట్టించుకోవట్లేదు. కౌలుకు సాగు చేయాలంటేనే ఇబ్బందికర పరిస్థితి ఉంటోంది. ప్రభుత్వం మాటల్లో తప్ప చేతల్లో సాయాన్ని అందించట్లేదు.

ధాన్యం బకాయిలు చెల్లించాలి..

మామిడిశెట్టి రామాంజనేయులు, కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, భీమవరం

దాళ్వా పంట చేతికొస్తున్నా ప్రభుత్వం సార్వా ధాన్యం డబ్బు రైతులకు, కౌలురైతులకు చెల్లించకపోవడం దారుణం. జిల్లాలో 1300 మందిపైగా రైతులకు రూ.16 కోట్ల 40 లక్షల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఎక్కువ శాతం కౌలు రైతులకు డబ్బు అందాల్సి ఉంది. ప్రభుత్వం నెలలు తరబడి ధాన్యం డబ్బు ఇవ్వకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగి ఇబ్బందులు పడుతున్నారు. దాళ్వా పంటలకు పెట్టుబడికి డబ్బులు లేని పరిస్థితి. తక్షణం ధాన్యం డబ్బు, పంటనష్టం కౌలురైతులకు వెంటనే చెల్లించాలి. పొట్టదశ, పంట దశలో ఉన్న వరి పొలాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలి.

కూలీలకు ఉపాధి పనులు కల్పించాలి

జిల్లా కలెక్టర్‌కు వ్యవసాయ కార్మిక సంఘం నేతల వినతి

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధి కూలీలకు ఉపాధి కల్పనలో భాగంగా పంట, మురుగు కాలువల పనులను యథావిధిగా కొనసాగించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు, సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకత్వం శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెల్టా ప్రాంతంలో ముఖ్యంగా పంట, మురుగు కాలువల్లో ఎక్కువ పని దినాలు కల్పిస్తారని, ఇతర ప్రాంతాల వలే చెరువు పనులు ఇక్కడ ఉండవని తెలిపారు. ఏటా మార్చిలో ముమ్మరంగా పనులు జరిగేవని, ఈ ఏడాది ఈ నిర్ణయం వల్ల గ్రామాల్లో సక్రమంగా పనులు చూపడం లేదని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి ఇక్కడ వాస్తవ పరిస్థితులను తీసుకెళ్లి బడ్జెట్లో నిధులు పెంచి ఎక్కువ రోజులు పని దినాలు కనీస వేతనం అందించే చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సమస్యను డ్వామా పీడీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్య.కా.స నేతలు

ఆదర్శప్రాయులు వెంకటస్వామి

వర్థంతి సభలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

వర్థంతి సభలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

యుటిఎఫ్ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన అప్పారి వెంకటస్వామిని ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి అన్నారు. భీమవరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో యుటిఎఫ్ ఉద్యమ నిర్మాత, వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి వర్థంతి సభ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో వెంకటస్వామి చిత్రపటానికి రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ యుటిఎఫ్ ఏడు వేల మంది సభ్యత్వంతో ప్రారంభమై లక్ష సభ్యత్వాన్ని చేరుకోవడంలో ఎవిఎస్ గణనీయమైన పాత్ర పోషించారన్నారు. సంఘ లక్ష్యాలకు అనుగుణంగా సంఘాన్ని తీర్చిదిద్దడంలో, కార్యకర్తలను తయారు చేయడంలో, సామాజిక కార్యకర్తలుగా మలచడంలో ఎవిఎస్ పాత్ర ఎనలేనిదన్నారు. 25 ఏళ్ల పాటు యుటిఎఫ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి, సంఘాన్ని ఉపాధ్యాయులకు అండగా ఉండేలా మలిచారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం మాట్లాడుతూ ఎవిఎస్ నిజాయితీగా, క్రమశిక్షణగా, కార్యకర్త స్థాయి నుంచి అగ్రనేత వరకు పట్టుదలతో పని చేశారన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జివివి.రామానుజరావు మాట్లాడుతూ ఎవిఎస్ 2000లో కాకినాడలో రజతోత్సవాలు విజయవంతంగా నిర్వహించారన్నారు. కార్యకర్తలను గుర్తించడం, ప్రోత్సహించడం, అవకాశాలు కల్పించడం, నాయకులుగా తీర్చిదిద్దడం ఆయన ప్రత్యేకత అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు కెఎస్‌సిహెచ్.సాయిరామ్, సిహెచ్.కుమారబాబ్జి, జి.రామకృష్ణంరాజు, కె.రామకృష్ణప్రసాద్, డి.ఏసుబాబు, రాష్ట్ర కౌన్సిలర్ జివివి.రామానుజరావు, నాయకులు కె.త్రిమూర్తులు, బి.నాగబాబు, కె.శామ్యూల్‌రాజు, విఎస్‌పి.శ్రీనివాస్, ఎంఎంసిహెచ్‌ఎస్.శ్రీనివాస్, జివి.రమణ, ఎన్.ప్రసాద్‌బాబు, ఎం.శివరామరాజు, పిల్లి శ్రీనివాస్, వై.తిలక్, కె.సత్యనారాయణ, జి.శంకర్‌బాబు, విష్ణు ప్రసాద్, కె.రవిచంద్రకుమార్, ఎం.చినసత్యబాబు, కె.రామ్మూర్తిరాజు, బిఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ గృహ నిర్బంధం

ప్రజాశక్తి - పాలకొల్లు

బిఆర్.అంబేద్కర్‌ను సోషల్ మీడియాలో ఆచంటకు చెందిన వ్యక్తి అసభ్యకరంగా మాట్లాడిన నేపథ్యంలో కొందరు దళిత నేతలు పెనుగొండ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. ఆందోళన చేసిన 20 మంది దళిత యువకులను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు నల్లి రాజేష్ పెనుగొండ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లనివ్వకుండా పాలకొల్లులోని ఆయన ఇంటి వద్ద యలమంచిలి ఎస్ఐ ప్రసాద్, పాలకొల్లు రూరల్ ఎస్ఐ హరికృష్ణ, పాలకొల్లు రూరల్ హెడ్ కానిస్టేబుల్ మూర్తి బృందం హౌస్ అరెస్టు చేశారు.

నల్లి రాజేష్‌ను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

నన్నేటి పుష్పరాజు హౌస్ అరెస్ట్

ఆచంట : ఆచంట వేమవరంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజును శుక్రవారం ఉదయం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పుష్పరాజు మాట్లాడుతూ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. ఇటువంటి సంఘటనలు మరోసారి పునరావృత్తం కాకుండా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నన్నేటి పుష్పరాజును హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

పోలీస్‌స్టేషన్ వద్ద దళితుల నిరసన

పెనుగొండ : ఆచంటకు చెందిన సూర్య అనే వ్యక్తి సోషల్‌మీడియాలో అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ పెనుగొండ పోలీస్‌స్టేషన్ వద్ద దళితులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం చాలా బాధాకరమన్నారు. తక్షణమే సూర్యపై కేసు నమోదు చేయాలంటూ దళిత నాయకులు పెనుగొండ పోలీస్ స్టేషన్‌ను ముట్టడించి రాళ్లతో అద్దాలను, పోలీస్ స్టేషన్లో సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. దీంతో పోలీస్ బలగాలు రంగ ప్రవేశం చేసి లాఠీ ఛార్జ్ చేశారు. 20మందిపై కేసు నమోదు చేసి కోర్టుకు తర లించినట్లు ఎస్ఐ షేక్‌సుభాని తెలిపారు.

ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

పోడూరు : అంబేద్కర్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అంబేద్కర్ సేన పాలకొల్లు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బల్ల రాజశేఖర్ డిమాండ్ చేశారు. వేడంగిపాలెంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అంబేద్కర్‌పై అనుచిత పోస్టులు పెట్టడం చాలా దుర్మార్గమన్నారు. ఇటువంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి - తణుకురూరల్

బిజెపి విధానాలు ప్రజానీకానికి, సమాజానికి వ్యతిరేకమని, కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశాఖ ఉక్కు పోరాట కమిటీ ఛైర్మన్ సిహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎన్‌జిఒ హోంలో సిఐటియు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ పదేళ్లలో ఒక్క భారీ పరిశ్రమను కూడా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని, ఉన్న ఏకైక భారీ పరిశ్రమ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కూడా విదేశీ కంపెనీ దక్షిణ కొరియా పోస్కోకు కట్టబెట్టాలని, నూరుశాతం అమ్మాలని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. ఈ పదేళ్లలో అభివృద్ధి కాకపోవడానికి విభజన చట్టంలో ఉన్న అంశాలు అమలు చేయకపోవడం ప్రధాన కారణమన్నారు. ప్రత్యేక హోదా వస్తే కొన్ని పన్ను రాయితీలు వస్తాయన్నారు. పరిశ్రమలు వస్తే ఉపాధి వస్తుందన్నారు. రాష్ట్రంలో ఘోరంగా పారిశ్రామిక అభివృద్ధి పడిపోయిందన్నారు. పరిశ్రమలు వచ్చాయని పేరుకు చెప్పుకోవడం తప్ప ఉన్న పరిశ్రమలు పోయాయన్నారు. డైరీ, షుగర్, జ్యూట్ పూర్తిగా మూత పడ్డాయన్నారు. ఒకప్పుడు తణుకు చాలా ప్రఖ్యాతగాంచిన పారిశ్రామిక కేంద్రమన్నారు. నేడు మసకబారిన పడి పరిశ్రమలు లేకుండా పోయాయన్నారు. ఉన్న కంపెనీలు వచ్చే కంపెనీలు కొన్ని ఆక్వా, ఫార్మా లాంటివి సర్కస్ కంపెనీలని, ఇవి ఎక్కువ కాలం ఉండవని తెలిపారు. అటువంటి కంపెనీలు స్పెషల్ ఎకనమిక్ జోన్ల పేరుతో వాళ్లకు రాయితీలు ఇస్తారన్నారు. పారిశ్రామిక అభివృద్ధి తీవ్రంగా కుంటుపడిందన్నారు. ఇది రాష్ట్రానికి చాలా నష్టదాయకమన్నారు. పారిశ్రామిక అభివృద్ధి లేకుండా ఏ రాష్ట్రం కూడా ముందుకెళ్లదన్నారు. బిజెపి కార్మిక, రైతాంగ వ్యతిరేక ప్రభుత్వమని, కార్మికులకు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి స్వాతంత్రం ముందు నుంచి ఉన్న హక్కులను లేకుండా కాలరాస్తోందన్నారు. లేబర్ వ్యవస్థ అంతా నిర్వీర్యం అయిపోయిందని తెలిపారు. వ్యవసాయాన్ని మొత్తం కార్పొరేట్ చేయాలని ప్రయత్నిస్తోందన్నారు. ఢిల్లీ చుట్టూ ఐదు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున పోరాటాలు జరగడానికి ప్రధాన కారణమన్నారు. కార్మిక, కర్షక ఐక్యతతో మోడీ విధానాలను ఓడించాలని, ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఓడించాలని సిఐటియు పిలుపు నిచ్చిందన్నారు. కార్మికులకు రాజకీయాలు వద్దు అనే సంస్థలు అనేకం ఉన్నాయని, అయితే సిఐటియు రాజకీయాలతో సంబంధం లేకుండా ఏదీ లేదన్నారు. బిజెపి అవినీతి బ్యాంక్ బాండ్ల ద్వారా స్పష్టంగా అర్థమౌతోందన్నారు. మెగా ఇంజినీరింగ్ దగ్గర నుంచి అనేక కంపెనీలు వందల కోట్ల రూపాయలు అధికారంలో ఉన్నటువంటి మోడీ ప్రభుత్వానికి అప్పజెప్పడం జరిగిందన్నారు. అందువల్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్, జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, నాయకులు నీలాపు ఆది నారాయణబాబు, గుబ్బల గోపి పాల్గొన్నారు.

టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థిగా మహేష్ యాదవ్

వైసిపి, టిడిపి ఒకే సామాజిక తరగతి అభ్యర్థులకు టిక్కెట్

ఏలూరు ఎంపీ టిక్కెట్ తమకే అంటున్న బిజెపి నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మహేష్ యాదవ్

ఎట్టకేలకు ఏలూరు పార్లమెంట్ టిడిపి అభ్యర్థిపై ఉత్కంఠ వీడింది. టిడిపిలో ముఖ్యనాయకుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అల్లుడు పుట్టా మహేష్ యాదవ్‌ను టిడిపి ఎంపీ అభ్యర్థిగా శుక్రవారం టిడిపి అధిష్టానం ప్రకటించింది. ఆయన స్వస్థలం కడప జిల్లా. గతంలో టిడిపి ఛైర్మన్‌గా పనిచేసిన పుట్టా సుధాకర్ కుమారుడే మహేష్ యాదవ్. పుట్టా మహేష్ యాదవ్ ఇప్పటి వరకూ ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనలేదు. వ్యాపారవేత్తగా ఉన్నారు. తొలిసారిగా ఎంపీగా పోటీచేస్తున్న పరిస్థితి. వైసిపి ఏలూరు ఎంపీ అభ్యర్థిగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్‌కుమార్ యాదవ్‌ను ప్రకటించింది. ఏలూరు పార్లమెంట్ పరిధిలో యాదవ సామాజిక తరగతి ఓట్లు అధికంగా ఉన్నాయి. దీంతో అదే సామాజిక తరగతికి చెందిన అభ్యర్థి కోసం టిడిపి రకరకాల వడపోతలు చేపట్టింది. కామవరపుకోటకు చెందిన గోరుమచ్చు గోపాల్ యాదవ్ పేరు ప్రముఖంగా వినిపించింది. తర్వాత తెలంగాణలో పోలీస్ అధికారిగా పనిచేస్తున్న సత్యనారాయణ గౌడ్ పేరు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం సాగింది. చివరకు పుట్టా మహేష్‌యాదవ్‌కు టిక్కెట్ ఇచ్చారు. ఒకే సామాజిక తరగతికి చెందిన అభ్యర్థులు ఎంపీగా పోటీచేస్తుండటంతో ఏలూరు పార్లమెంట్ స్థానంలో పోటీ హోరాహోరీగా ఉండే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

'తపన' చౌదరికి ఏలూరు ఎంపీ సీటుపై పోరాటం ఆగదు

బిజెపి నాయకుల ధిక్కార స్వరం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు ఎంపీ స్థానం తపన చౌదరి, గారపాటి సీతారామంజనేయ చౌదరికి ఇచ్చే వరకూ పోరాటం ఆగదని బిజెపి నాయకులు ధిక్కార స్వరం పెంచారు. ఏలూరు జిల్లాలో శుక్రవారం అశోక్ నగర్‌లో ఉన్న బిజెపి పార్టీ కార్యాలయంలో బిజెపి నాయకులు పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఉండవల్లి వెంకటరావు కిసాన్ మోర్చా అధ్యక్షుడు మాట్లాడుతూ బిజెపి టిడిపి జనసేన పొత్తుల్లో భాగంగా ఏలూరు పార్లమెంట్ సీటును టిడిపికి కేటాయించడం చాలా దురదష్టకరమన్నారు. ఏలూరులో టిడిపి పార్లమెంట్ సీటు ప్రకటించినప్పటికీ బిజెపి హై కమాండ్ నుంచి తమకు ఎటువంటి సమాచారం లేదని కేంద్రంలో ఇంకా మంతనాలు జరుగుతున్నాయన్నారు. నామినేషన్ వేసే వరకు సమయం ఉందని సీతారామాంజనేయ చౌదరికి సీటు వచ్చే వరకూ పోరాడుతామన్నారు. రాష్ట్ర అభివద్ధి కోసం దేశ అభివద్ధి కోసం పొత్తు పెట్టుకుంటున్నామని చెప్పి టీడీపీ సీటు ప్రకటించడం చాలా దురదష్టకరమన్నారు. బిజెపితో పొత్తు ఉంటేనే కానీ భవిష్యత్తు ఉందనుకున్న పార్టీలు ఈ రోజు పొత్తు కుదిరిన తర్వాత వారు ఇష్టాన్ని సారం సీట్లు ప్రకటించడం అన్యాయమని అన్నారు. ఆ పార్టీ నాయకులు గాడి రాంబాబు మాట్లాడుతూ టిడిపి పార్టీ ప్రకటించిన సీట్లనే జాతీయ పార్టీ అంగీకరించడం రాష్ట్రంలో బిజెపి పార్టీ నాయకత్వ వైఫల్యం అని అన్నారు . గెలిచే సీట్లను టిడిపి ఉంచుకొని వారికి అభ్యర్థులు లేని చోట బీజేపీకి సీట్లు ఇవ్వడం చంద్రబాబు యొక్క ఎత్తుగడలు అని, చంద్రబాబు జిత్తుల మారి నక్క యొక్క ఎత్తుగడలు అని చెప్పొచ్చున్నారు. ఎక్కడి నుంచో వచ్చిన వారికి సీట్ కేటాయించడం లోకల్ వారికి కేటాయించకపోవడం అన్యాయమని ఎన్నికలకు ఇంకా సమయం ఉంది కనుక పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఏలూరు పార్లమెంట్ సీటు సీతారామాంజనేయ చౌదరికి కేటాయించాలని అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ అధ్యక్షులు, నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎఎను ఉపసంహరించుకోవాలి

సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - నరసాపురం



కరపత్రాలతో ముస్లింలు, ప్రజాసంఘాల నాయకులు

దేశాన్ని బల హీనపరిచే సిఎఎ చట్టం అమలును అడ్డుకోవాలని సిపిఎం ముద్రించిన కరపత్రాలను, సిఎఎపై ప్రజాశక్తి ముద్రించిన ప్రత్యేక సంచికను పెద్ద మసీదు, చిన్న మసీదు వద్ద ముస్లిం మైనార్టీ ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ నరేంద్రమోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) అమలు కోసం నిబంధనలు ప్రకటించడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన దేశ సమైక్యతకు ప్రమాదకరంగా సిఎఎ చట్టం ఉందన్నారు. ముస్లిం మైనార్టీలను లక్ష్యం చేసుకుని ప్రకటించిన సిఎఎ అమలు తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పొన్నాడ రాము, మహమ్మద్ అజీజ్, ముస్లిం పెద్దలు అబ్దుల్ రెహమాన్, ఎండి మోహిత్, షేక్ నాగూర్, ఎండీ కాజా, ఇమ్రాన్ ఖాన్, ఎండి బాబుల్లా, మున్నా పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - ఆచంట

సి విజిల్ యాప్ నిర్వహణకు కేటాయించిన అధికారులు 24 గంటలూ గ్రామాల్లో అందుబాటులో ఉండాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సి విజిల్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌పై అధికారులకు గూగుల్ మీట్ ద్వారా శుక్రవారం రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో అక్రమాలకు, నిబంధనలు ఉల్లంఘనలు జరగకుండా అడ్డుకట్ట వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఐపి శెట్టి, ఎంఎం.రెహమాన్, ఎండి ఇస్మాయిల్, జి.సత్యనారాయణ, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శశి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్ కళాశాలలో సైకలాజికల్ సెల్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు, అధ్యాపకులకు శుక్రవారం విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీ వారి సహకారంతో మానసిక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ ఝాన్సీరాణి మాట్లాడుతూ మారుతున్న జీవన శైలిలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత, వృత్తిపరమైన అంశాలను ప్రభావితం చేసే ఒత్తిడి, కోపం, విచారం వంటి వాటిని అదుపులో పెట్టుకోవాలన్నారు. డాక్టర్ దేవిరెడ్డి కళ్యాణి మాట్లాడుతూ మనుషుల జీవితంలో మానసిక ఆరోగ్యం తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందన్నారు. కళాశాల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ మాట్లాడుతూ విద్య, సంభాషణ, సృజనాత్మక వ్యక్తీకరణ ద్వారా మానసిక ఆరోగ్యం మెరుగుపరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మొహమ్మద్ ఇస్మాయిల్, కో-ఆర్డినేటర్ అయేషా రానా పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేశానని విప్, ఎంఎల్ఎ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆయన శుక్రవారం ఎన్నికల శంఖారావానికి శ్రీకారం చుట్టారు. తొలుత వినాయకుడిని, మావుళ్లమ్మను దర్శించుకున్నారు. అక్కడ నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఎగా ఒక ఓటు తనకు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలకు మరొక ఓటు చొప్పున రెండు ఓట్లు వేయాలని ఓటర్లను ఆయన అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, డాక్టర్ వేగిరాజు రామకృష్ణంరాజు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, నియోజవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జగన్‌ను మళ్లీ సిఎం చేయాలి'

ప్రజాశక్తి - నరసాపురం

సిఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేయాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కోరారు. మండలంలోని మల్లవరంలో ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచార కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రచారం చేపట్టారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - ఉండి

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఉండి మెయిన్ సెంటర్‌లో పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీం వాహన తనిఖీలను శుక్రవారం ఉదయం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు ఎం.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎవరైనా రూ.50 వేలు మించి నగదు తీసుకెళ్తే ఆధారం చూపించాలని, లేకపోతే నగదును స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.

వైసిపి మండలాధ్యక్షునికి పితృ వియోగం

ప్రజాశక్తి - ఉండి

వైసిపి ఉండి మండలాధ్యక్షులు పెన్మెత్స వెంకట రామకృష్ణ ఆంజనేయరాజు తండ్రి కృష్ణంరాజు శుక్రవారం రాత్రి మృతి చెందారు. మండలంలోని వాండ్రం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు పెన్మెత్స కృష్ణంరాజు లయన్స్ క్లబ్ సభ్యునిగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు ఎంతో తోడ్పాటు అందించేవారు. కృష్ణంరాజు మృతితో వాండ్రం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సత్యనారాయణకు సిపిఎంతో సంబంధాలు లేవు

ఆ పార్టీ మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పెనుగొండ

గుర్రాల సత్యనారాయణకు సిపిఎంతో సంబంధం లేదని ఆ పార్టీ మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన సిపిఎం నుంచి వైసిపిలో చేరినట్లు ఇటీవల వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. గుర్రాల సత్యనారాయణకు పార్టీతోనూ, ప్రజాసంఘాలతోనూ చాలాకాలంగా సంబంధాలు లేవని, ఆయన పార్టీ సభ్యత్వం సైతం రెన్యువల్ చేయించుకోలేదని పేర్కొన్నారు. ఆయనకు సిపిఎంతో ఎటువంటి సంబంధాలు లేవని స్పష్టం చేశారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

ఉండి స్వతంత్ర అభ్యర్థి శివరామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రచారంలో శివరామరాజు

ముచ్చటగా మూడోసారి ఉండి నియోజకవర్గంలో గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని మాజీ ఎంఎల్ఎ, స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. మండలంలోని కలవపూడిలో గరువు, మామిడిపూడి ప్రాంతాల్లో మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకటశివరామరాజు శుక్రవారం రెండో రోజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గేదల జాన్, మాజీ ఎంపిపి మంతెన వెంకట రామరాజు (బాబు), మాజీ సర్పంచి ముదుండి సూర్యకాంతం మణిబాబు, వేగేశ్న బాలగణపతి వర్మ, నంబూరి త్రినాధమూర్తిరాజు, ముదుండి వెంకట్రామరాజు, మంతెనశ్రీ వెంకట్రాజు, మంతెన రామరాజు, మోపిదేవినాగశ్రీనివాస్, కలా సూర్యనారాయణ, బొక్క నరసింహస్వామి, అరిటాకుల వీరబాబు పాల్గొన్నారు.

చేనేత వర్గాలను ఆదుకుంటా : నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

చేనేత రంగాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని టిడిపి పాలకొల్లు ఎంఎల్ఎ అభ్యర్థి నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని వాలమర్రులో ఆయన శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, జనసేన నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోడి విజయభాస్కర్, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, ఉద్దరాజు రామకృష్ణంరాజు, వాస కోటేశ్వరరావు, రావూరి ఏసు, బండారు ఆదిలక్ష్మి, తమ్మలక్ష్మి, పాల విజయ్‌కుమారి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

తన భూమిని కబ్జాచేశారంటూ ఫిర్యాదు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కాళీపట్నం రెవెన్యూ పరిధి పాతపాడు పంచాయతీ పరిధిలో తమ కుటుంబానికి చెందిన 50 ఎకరాల భూమిని కబ్జాచేసి ఆక్వా చెరువులుగా తవ్వేస్తున్నారంటూ భూ యజమాని సాగిరాజు రామ గోపాలరాజు శుక్రవారం తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. కాళీపట్నం రెవెన్యూ పరిధిలోని తనకు, తన కుమారుడు, ఇద్దరు కుమార్తెలకు పూర్వార్జితంగా 50 ఎకరాలు భూమి సంక్రమించిందన్నారు. ఈ భూమిని తాము సాగు చేసుకుంటున్నామన్నారు. కృష్ణా జిల్లా చిన్నగొల్లపాలెంకు చెందిన రేవు కృష్ణార్జునరావు అతని కుటుంబ సభ్యులు ఈభూమిని కబ్జా చేసి ఆక్వా చెరువుగా తవ్వేస్తున్నారన్నారు. ఈ భూ హక్కులు పరిశీలించి తమ భూమి కబ్జాదారుల నుండి విముక్తి కలిగించాలని కోరారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

నీటిని పొదుపు చేయాలి

ఘనంగా ప్రపంచ జల దినోత్సవం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురంలో..

ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని నరసాపురం యుకె వనితా క్లబ్ వారు నీటి ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడానికి స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, వనితాక్లబ్ రీజనల్ ఛైర్‌పర్సన్, తెలుగు యువత జిల్లా అధ్యక్షురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రపంచంలో నీటి 70 శాతం అని, దానిలో మంచినీరు మూడు శాతమేనని చెప్పారు. భవిష్యత్ తరాల కోసం నీటిని పొదుపు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. నీరే మానవునికి జీవనాధారమన్నారు. నీరు లేకపోతే మనిషి మనుగడే లేదన్నారు. అధ్యక్షురాలు పుప్పాల ఉమా మహేశ్వరి మాట్లాడుతూ మాట్లాడారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల అభివృద్ధిని కాంక్షిస్తూ ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులకు 40 రోజుల పాటు రూ.మూడు వేల విలువైన సాయంకాలం స్నాక్స్ అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బండి స్వర్ణలత, ఉపాధ్యక్షురాలు పుప్పాల ఉషా కమల, సుంకర రాజకుమారి, గంటా వెంకటరమణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకుంటే భవిష్యత్తులో నీటి అవసరాలకు కొరత ఉండదని నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాదులు యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్, దొంగ నరసింహరాజు, నక్కా ఆనందబాబు అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామ సచివాలయం-2లో సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి నీటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగాన్యాయవాదులు మాట్లాడారు.

పాలకొల్లు : పాలకొల్లు డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి, పాలకొల్లు జెసిఐ ప్రతినిధులు విద్యార్థుల ర్యాలీని ప్రారంభించారు. పట్టణ ప్రజలకు నీటి సంరక్షణ, పొదుపు ఆవశ్యకతను వివరించే కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్, రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ స్వరూప్ సింగ్ , విజయలక్ష్మి, డాక్టర్ పివి.రమణ, పిఎ నోబుల్ రాజ్, అధ్యాపకులు పాల్గొన్నారు. పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ జల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ తిరువీధుల రాజరాజేశ్వరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రసాయనశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ యామిని, రసాయనశాస్త్ర అధ్యాపకులు వంశీ, జగపతిబాబు, ఆంగ్ల విభాగం నుంచి దినకర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. నీటిని పొందుపుగా వాడుకోవాలని జివిఎన్‌విఆర్ఎం మున్సిపల్ స్కూల్ హెచ్ఎం రాయపూడి భవానీ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని జివిఎన్‌విఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో ప్రపంచ జల దినోత్సవ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్ మాట్లాడారు. నీటిని మనం పొదుపుగా వాడుకుని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత మనదేనని అన్నారు. ప్రపంచంలో భారీ యుద్ధాల్లో చనిపోయిన వారి కన్నా కలుషితమైన నీటిని తాగడం వల్ల మరణించిన వారి సంఖ్య ఎక్కువ అన్నారు.

భీమవరం రూరల్ : ఎన్నో జల వనరులు ఉన్నప్పటికీ 3 శాతం మాత్రమే నీటిని ఉపయోగించుకుంటున్నామని పర్యావరణ శాస్త్రవేత్త యూత్ హాస్టల్స్ నాయకులు డాక్టర్ మట్లపూడి సత్యనారయణ అన్నారు. శుక్రవారం స్థానిక సంస్కార్ స్కూల్లో శ్రీవిజ్ఞానవేదిక, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించారు. సత్యనారయణ మాట్లాడుతూ చాలా చోట్ల నీటి ఇబ్బందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు వి.కుమారి, కె.కుమారి, ఎస్‌కె.చాన్ భాషా పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలం, పట్టణంలోని 13 కేంద్రాలో శుక్రవారం పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఎంఇఒ పిఎంకె.జ్యోతి తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 2969 మంది విద్యార్థులకు 2685 మంది హాజరయ్యారని, 284 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు.

మొగల్తూరు : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాల్లో శుక్రవారం ప్రశాంతంగా జరిగాయని ఎంఇఒ యు.శ్యామ్యూల్‌జాన్ తెలిపారు. 888 మంది విద్యార్థులకు 835 మంది హాజరయ్యారని తెలిపారు. 53 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. గతంలో లెక్కలు పరీక్ష తప్పి ఇప్పుడు రాస్తున్న 35 మంది విద్యార్థులకు 14 మంది హాజరయ్యారని, 21 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

పెనుగొండ :మండలంలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎంఇఒ సుభాకర్ తెలిపారు. శుక్రవారం లెక్కల పరీక్షకు 1251 మంది విద్యార్థులకు 1096 మంది హాజరయ్యారని, 155 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

నరసాపురం :పదో తరగతి పరీక్షలు మండలంలో ప్రశాంతంగా జరిగాయని ఎంఇఒ పి.పుష్పరాజ్యం తెలిపారు. శుక్రవారం జరిగిన లెక్కల పరీక్షకు మండలంలోని పరీక్షా కేంద్రాల్లో 1831 మంది విద్యార్థులకు 1751 హాజరవ్వగా 80 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

భీమవరం :పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన గణిత పరీక్షకు 793 మంది గైర్హాజరయ్యారు. గణిత పరీక్షకు 21527 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 20734 మంది హాజరయ్యారు. 793 మంది గైహాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 96.32 శాతం హాజరు నమోదయింది. ఎస్-ఎస్‌సి (ఎపిఒఎస్ఎస్) గణిత పరీక్షకు 830 మందికి 729 మంది విద్యార్థులు హాజరయ్యారు. 101 మంది గైర్హాజరయ్యారు. 87.83 శాతం హాజరు నమోదయింది. 31 పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, 8 పరీక్షా కేంద్రాలు జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్ వెంకటరమణలు తనిఖీ చేశారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని డిఇఒ వెంకటరమణ తెలిపారు.

ఉండి : మండల వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఇఒ బొల్లిపో జ్యోతి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుక్రవారం నిర్వహించిన గణిత శాస్త్రం పరీక్షకు 714 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 633 మంది హాజరయ్యారని, 81 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఎన్నికల కోడ్‌ను అమలు చేయని అధికారులు

ప్రజాశక్తి - ఉండి

ఉండిలో అధికారులు ఎన్నికల కోడ్ అమలు చేయడంలో తారతమ్యాలు చూపిస్తున్నారని వైసిపి మండల ఉపాధ్యక్షులు రాయి సతీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉండి మెయిన్ సెంటర్‌లోని వైసిపి దిమ్మకు అధికారులు రంగులు తొలగించారని, అయితే టిడిపి, బిజెపి దిమ్మల రంగులు తొలగించకుండా కనీసం పరదా కూడా కట్టకుండా వదిలేయడం వెనుక అధికారుల నిర్లక్ష్యం తెలుస్తోందని అన్నారు. దీంతో శుక్రవారం ఉండి మండల అభివృద్ధి అధికారి ఎస్.రవీంద్రకురాయి సతీష్, మండల ప్రధాన కార్యదర్శి గళావిల్లి ధనుంజయ, గుండాబత్తుల సుబ్బారావు ఫిర్యాదు చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

పేద కుటుంబాలకు దాట్ల వెంకట రామరాజు అండగా ఉంటూ దాట్ల శ్రీదేవి మోమోరియల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని ఈదా భోగేష్ అన్నారు. కాళ్లకూరులో ఇటీవల మరణించిన దావులూరి సక్కుబాయి కుటుంబానికి ట్రస్ట్ ద్వారా రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు.

'రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన'

ప్రజాశక్తి - ఆచంట

ప్రజా సంక్షేమ పాలన అందించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పెనుమంట్ర మండలం నెలమూరు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శుక్రవారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అవినీతికి తావు లేకుండా సంక్షేమ పాలన అందించిన ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కొచ్చర్లపాటి మంగతాయారు, జెడ్‌పిటిసి సభ్యులు గౌరీ సుభాషిని, నేతలు అనురాధ జోగి రెడ్డి, నాగరాజు లక్ష్మి, వెంకటరామరాజు పాల్గొన్నారు.

వడ్లవానిపాలెంలో గోపీ పర్యటన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని వడ్లవానిపాలెంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసిపి పాలకొల్లు ఎంఎల్ఎ అభ్యర్థి గుడాల గోపీ శుక్రవారం పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. సంక్షేమ పథకాలన్నీ అమలు జరగాలంటే మళ్లీ వైసిపి అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పెన్మత్స యేసురాజు , యడ్ల తాతాజీ, చిట్టూరి ఏడుకొండలు, పితాని సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు నడిపిన గోవిందరాజులునాయుడు, కర్రి జయసరిత, ఏనుగుపల్లి చంద్రశేఖర్, గుమ్మాపు పెద్దిరాజు, నున్నబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

1 నుంచి స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆదర్శ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహిస్తున్నామని ఆ సంస్థ ప్రెసిడెంట్ రొక్కాల నాగ బుజ్జి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడేపల్లిగూడెంలోని సంస్థ కార్యాలయం వద్ద ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. ఈ తరగతులు పూర్తి చేసిన వారికి ఉచితంగా సర్టిఫికెట్స్ ఇస్తామని తెలిపారు. వివరాలకు 6305683467, ngoadarsh333@gmail.com సంప్రదించాలని తెలిపారు.

వైసిపిలోకి చేరిక

ప్రజాశక్తి - నరసాపురం

జనసేన, టిడిపి నాయకులు శుక్రవారం ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సమక్షంలో శుక్రవారం వైసిపిలో చేరారు. పార్టీలో చేరినవారికి ప్రసాదరాజు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మైలాబత్తుల కిరణ్‌కుమార్, రాజ్‌కుమార్, రాజేష్, పిల్లి రత్నంరాజు, కొక్కిరగడ్డ కుమార్‌రాజు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - ఉండి

భీమవరం రూరల్...

పౌష్టికాహారం మాసోత్సవాల సందర్భంగా ఐసిడిఎస్ పిలుపుమేరకు అంగన్వాడీ కార్యకర్తలు పోషక అభియాన్ కార్యక్రమాలు మండల వ్యాప్తంగా నిర్వహించారు. పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పిస్తూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషణ పక్వాడ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, చిన్నారులకు, తల్లులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో అంగన్వాడీలు అనంతలక్ష్మి, తవిటమ్మ, చైతన్య, గడి కుసుమ పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : నిత్యం పోషకాహారాలు తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని ఐసిడిఎస్ పీడీ బి.సుజాతారాణి అన్నారు. మండలంలోని యనమదుర్రు, దిరుసుమర్రు గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం పోషకాహార పక్షోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుజాతారాణి విద్యార్థులు, బాలింతలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా బాలికలు ఎక్కువ పోషకాలు ఉండే ఆహారాలు తీసుకుంటే రక్తహీనతతో పాటు యుక్త వయసులో వచ్చే పలు సమస్యల నుంచి తప్పించుకోవచ్చని ఆమె సూచించారు. భీమవరం ప్రాజెక్ట్ సిడిపిఒ లక్ష్మీకాంతం మాట్లాడుతూ ప్రతి సెంటర్‌లోనూ చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతోపాటు బాలింతలకు, చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనిల్ కుమార్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భారత్‌లోనే స్టార్టప్‌లు పెట్టండి

ప్రముఖ సాఫ్ట్‌వేర్ రంగ నిపుణులు అల్లూరి పృథ్వీరాజ్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సాంకేతిక నిపుణులు తమ పరిజ్ఞానంతో స్వదేశంలోనే స్టార్టప్‌లు ఏర్పాటు చేయాలని ప్రముఖ సాఫ్ట్‌వేర్ రంగ నిపుణులు ఆటో డిట్ కో ఫౌండర్ ఎస్ఆర్‌కెఆర్ పూర్వ విద్యార్థి అల్లూరి పృథ్వీరాజ్ పేర్కొన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టిఇ) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిపుణ 24 పేరిట జరిగే జాతీయస్థాయి విద్యార్థి సింపోజియంకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి ఐఎస్‌టిఇ ఫ్యాకల్టీ అడ్వైజర్ ఎస్.రామ్‌గోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఇండియాలో స్టార్టప్‌లు ఏర్పాటు చేస్తే వాటికి మంచి ఆదరణ ఉందన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థి అల్లూరి పృథ్వీరాజ్ ఎంతో డిమాండ్ ఉన్న విదేశాలకు వెళ్లకుండా స్వదేశంలోనే స్టార్టప్ ప్రారంభించడమే కాకుండా తమ కళాశాలకు చెందిన కొంతమంది విద్యార్థులకు కూడా ఉపాధి కల్పిస్తున్నారన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీ కృష్ణంరాజు, ఐఎస్‌టిఇ ఫ్యాకల్టీ అడ్వైజర్ ఎస్.రామ్‌గోపాల్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌టిఇ విద్యార్థి విభాగం ఛైర్మన్ ఎన్.శశాంక్, వైస్ ఛైర్మన్ శశి చందన్, స్టూడెంట్ కౌన్సిలర్ పి.రూప్‌చంద్, సెక్రటరీ పి.శ్రీధర్, జాయింట్ సెక్రటరీ బి.కళ్యాణ్ సుభాష్ పాల్గొన్నారు.

బిజెపి ప్రజలకు చేసిందేమీ లేదు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్

ప్రజాశక్తి - తణుకు రూరల్

బిజెపి ప్రభుత్వం మతం పేరుతో రాజకీయాలు చేయడం తప్ప ఈ కాలంలో ప్రజలకు చేసిందేమీ లేదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ విమర్శించారు. స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో సిఐటియు రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాయ్ మాట్లాడుతూ పదేళ్ల నుంచి మోడీ ఇచ్చిన హామీలు కూడా అమలు చేయలేదన్నారు. ప్రజలపై భారాలు, కార్పొరేట్లకు రాయితీలు వంటివి చేయడంతో మోడీ విధానాలు అర్థమవుతున్నాయన్నారు. మతం-మతోన్మాదం అనే అంశం జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ బోధించారు. ఈ కార్యక్రమంలో ఎస్.సూర్నీడి వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు ఎన్.ఆదినారాయణబాబు, కార్యదర్శి గుబ్బల గోపీ పాల్గొన్నారు.

భవిష్యత్తు విద్యుత్ వాహనాలదే

తాడేపల్లిగూడెం :భవిష్యత్తు విద్యుత్ వాహనాలదేనని ప్రిన్సిపల్ ఇంజినీర్ లైట్ ఆన్ (సింగపూర్) డాక్టర్ సందీప్ మడిశెట్టి తెలిపారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ బిఎస్.మూర్తి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి పర్యవేక్షణ లో సంస్థలోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం, డిఎస్ ఐఆర్-సిఆర్‌టిడిహెచ్ సంయుక్త భాగస్వామ్యంతో విద్యుత్ వాహనాల పురోగతిలో సవాళ్లు, భవిష్యత్తు అంశంపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా సందీప్ మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణను పెంపొందించేందుకు విద్యుత్ వాహనాల వినియోగం రోజురోజుకు గణనీయంగా పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి.రమేష్ అధ్యక్షత వహించగా, రీసెర్చ్, కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్ కన్వీనర్‌గా వ్యవహరించారు. ముఖ్య అతిథి సందీప్‌ను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ పి.శంకర్, డాక్టర్ ఫణికృష్ణ కర్రి, అడహక్ ఫ్యాకల్టీ డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ మూర్తి, డాక్టర్ మురళి, డాక్టర్ అమృత్‌రాజు, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ పవన్ పాల్గొన్నారు.

జిల్లా సరిహద్దులో చెక్‌పోస్ట్

ప్రజాశక్తి - ఆకివీడు

తనిఖీ చేస్తున్న పోలీసులు

స్థానిక ఆకివీడు శివారు ఏలూరు జిల్లా సరిహద్దు ఉప్పుటేరు వద్ద జిల్లా పోలీసులు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. ఈ చెక్ పోస్టులో ఇద్దరు పోలీసు సిబ్బంది ఒక రెవెన్యూ సిబ్బంది ఒకరు ఎక్సైజ్ శాఖ నుంచి మొత్తం నలుగురు పని చేస్తున్నట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు.

కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

జువ్వలపాలెంలో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని తాడేపల్లిగూడెం టౌన్ ఎస్ఐ కోరారు. మండలంలోని జువ్వలపాలెంలో శుక్రవారం గ్రామసభ, కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

'కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన'

ప్రజాశక్తి - నరసాపురం

రాష్ట్రంలో పేద కుటుంబాలకు సంక్షేమ పాలనా అందించాలంటే ఒక్క కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఆ పార్టీ నాయకుడు మోకా చినశ్రీనివాస్ అన్నారు. మండలంలోని సరిపల్లి గ్రామంలో ఇందిరమ్మ అభయం పథకంలో మొబైల్ యాప్ ద్వారా కోఆర్డినేటర్లను మహిళా లబ్ధిదారులను జాయిన్ చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిల, జిల్లా అధ్యక్షులు బాబిల పిలుపుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మన్నెమ్మ, గొర్ల లక్ష్మి, పి.ధనుంజయ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

'వైసిపిని తరిమి కొట్టాలి'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రానున్న ఎన్నికల్లో వైసిపిని తరిమికొట్టాలని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడు రాజధానుల్లో ముఖ్య రాజధానిగా విశాఖను అభివృద్ధి చేస్తానన్న సిఎం జగన్ మాదకద్రవ్యాలకు కేంద్రంగా చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ గెలవాలని ఓటర్లకు డబ్బు, చీరలు, మద్యం, బహుమతులతో పాటు గంజాయి, డ్రగ్స్ సరఫరా చేస్తున్నారనేందుకు సిబిఐ విచారణ సాక్ష్యమని తెలిపారు. ఎన్నికలలో జగన్ గెలుపు కోసం బ్రెజిల్‌కి చెందిన డ్రగ్స్ మాఫియాతో వైసిపి చేతులు కలిపిందన్నారు. అంతర్జాతీయ డ్రగ్స్ కుంభకోణంలో వైసిపి నాయకుల హస్తం ఉందని పేర్కొన్నారు.

కనకదుర్గ ఆలయాన్ని సందర్శించిన శేషుబాబు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులోని కనకదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల కళ్యాణ మహోత్సవంలో టిటిడి సభ్యులు మేకా శేషుబాబు సతీమణి శశికళతో పాటు పాల్గొన్నారు. వారికి ఆలయ కమిటీ ఛైర్మన్ కావలి శ్రీను, ఇఒ సతీష్‌కుమార్, సిహెచ్.రాంబాబు స్వాగతం పలికారు. వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ జోగి వెంకటేశ్వరరావు, ఆలయ ట్రస్టీలు రేలంగి నరసింహరావు, గుండిబోయిన అరుణ్‌కుమార్, దాసరి దివస్త్రి, చినిమిల్లి గణపతి, గుండెబోయిన నాగేశ్వరరావు, గంట వెంకన్న, కుక్కల శ్రీనివాస్, దేవరపల్లి సత్తిబాబు, కోటేశ్వరరావు, పుల్లూరి నరేష్, బందెల నరేష్ పాల్గొన్నారు.

'వైసిపి పాలనలో ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యత కరువు'

ప్రజాశక్తి - ఉండి

ప్రజా ప్రతినిధులకు వైసిపి పాలనలో ప్రాధాన్యత కరువైందని ఎంఎల్ఎ మంతెన రామరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం మహాదేవపట్నంలో గ్రామ అధ్యక్షులు వనిమా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ, ఇంటింటికి రాంబాబు కార్యక్రమాల్లో పాల్గొన్న రామరాజు, నాగరాజు మాట్లాడారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు.

'భీమవరంలో అరాచక పాలన'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం నియోజకవర్గంలో అరాచకపాలన, కక్షపూరిత రాజకీయాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, జగన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని మాజీ ఎంఎల్ఎ, జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో 11వ వార్డులో మైనార్టీ ముస్లిమ్ నాయకులు కలిశారు. అనంతరం ఆయన వీరవాసరం, నౌడురు నాయకులను శ్రేణులను, మిలటరీ రాజును కలిశారు. జనసేన పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. జగన్ ప్రభుత్వాన్ని అంతం చేయడానికి ఓటర్లు సహకరించాలన్నారు. కక్షపూరిత రాజకీయాలకు భీమవరం కేంద్రం కాకుండా ఉండాలంటే జనసేన, టిడిపి, బిజెపి కూటమికి మద్దతివ్వాలని అన్నారు. కార్యక్రమంలో కోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, కైకరం గ్రామానికి చెందిన పెద్దిశెట్టి శివన్నారాయణ, S/o. రామమూర్తి అను నేను 2023 జనవరి నెలలో మోటార్ సైకిల్‌పై కైకరం నుండి ఉంగుటూరు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో నా యొక్క M 977341 నెంబర్ గల పాస్‌పోర్టు జారి పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు తెలియజేయగలరు.

గుత్తికొండ శ్రీనివాసరావు
అడ్వకేట్, తాడేపల్లిగూడెం
పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 98480 50089